"మరేంలేదు బాబూ! నా జీవితంలా నీ జీవితం కాకుండా ఉంటే అంతేచాలు, ఈ జన్మకి నే కోరుకునేదదే. నీకు తండ్రినైనందుకు, నా యందు విశ్వాసముంచి ఒక్క వాగ్దానం చెయ్యి. నీకై నువ్వు ఎవర్నీ చేసుకోడానికి నిశ్చయించుకోబోకు. నీ కాబోయే భార్యని నిర్ణయించడానికి ఈ నిర్భాగ్యుడికి అధికారం ఇయ్యి నాయనా. ఈ వాగ్దానమే నీనుంచి కోరేది" కొడుకు కండ్లల్లోకి చూస్తూ గంభీరంగా అన్నాడు. ఆ పితృమూర్తి చూపులలో ఏ అమరసందేశాలు గోచరించాయో ఏమోగాని కొన్ని క్షణాలపాటు అలా మౌనంగానే ఉండిపోయాడు చినభద్రయ్య.

చివరకి నెమ్మదిగా అన్నాడు—

"అలాగే నాన్నా వాగ్దానం చేస్తున్నా నీకిష్టమొచ్చిన పిల్లనే, చేసుకుంటా" అని.

"నా జీవితానికిప్పుడు సార్థక్యత చేకూరింది బాబూ" అంటూ సంతృప్తిగా నిట్టూర్చాడు పెదభద్రయ్య, మహిళామండలి వార్షికసభకి అధ్యక్షత వహించడానికి హడావుడిగా బయలు దేరుతున్న శ్రీమతి దుర్గమ్మని చూస్తూ.

---

స్కెచ్

# అంతస్తుల అంచనాలు

"పేపర్ బోయ్"

పబ్లిక్ గార్డెన్స్‌లో ఓ బెంచీమీద కూచొని ఎదుట ఉన్న సరస్సులో ఒడ్డున తేటనీళ్ళలోని అటూఇటూ కదిలిపోయే చేపల్ని-చిన్నవీ పెద్దవీ, చూస్తూ కూచున్నాను కాస్సేపుదాకా. పొద్దున్నుండీ కూడు లేదు. బాగా ఆకలవడంచేత అణా పెట్టి "పల్లీలు" కొని తినేసి, పొద్దు క్రుంకేవరకూ పుర స్తుకుంటో కడుపునిండా నీళ్ళు తాగుదామని నల్లావేపు వెళ్ళాను. అంతవరకూ పొదమాటున కాచుకూచొని ఉన్నాడేమో, జుత్తురేగి, చిరిగిపోయిన మలిన దుస్తులతో ఓ కుర్రాడు గబగబా నే కూచున్న బెంచీచేరి ఏమిటో వెదకడం మొదలుపెట్టాడు. ఆ ఏరేవి తప్పక నే తింటూండగా చెదిరిపడిన గింజలో, ఏమరుపాటున పడిపోయిన కాయలో అయుంటాయి. నా మనస్సు కలుక్కుమంది. ఆ కుర్రాడిమీద జాలివేసింది. నేనే 'నా' అనేదీ, 'నా' అనేవాళ్ళూ లేని దౌర్భాగ్యుణ్ణీ, దీనుణ్ణీ అనుకున్నాను అంతవరకూ. నా తరువాతి అంతస్తు కూడా ఉందన్నమాట! ప్రపంచంలో ఎన్ని అంతస్తులూ!

ఆకాశంలో ఎన్నో గాలి పడగలు ఎగురుతున్నాయి. అన్నీ ఒకే స్థాయిలో ఎగురుతున్నాయా? కొన్ని కనిపించీ కనిపించనంతటి దూరంలో నీలవర్ణంలో కలిసిపోయేంతవరకూ ప్రాకి యెగురుతున్నాయి. (అయితే ఇంకా పైకి ఎగరాలనే తహతహ చావలేదు) కొన్ని మరీ పైకి ఎగరలేకో, క్రిందికిరావడం ఇష్టంలేకో గిలగిలలాడుతున్నాయి. ఇంకా కొన్ని అత్యున్నతానికి ఎగ్రబాకి మధ్య తెగిపోయి నేల రాలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇక సామ్యం లేని దెక్కడ?

"అమ్మగోరూ! ఇయ్యాలయినా డబ్బు లిప్పించండి. గేదెకి గడ్డీ, తవుడూ ఆవీ కొనుక్కోవాలి."

"అయ్యో! వారివ్వాళ పెందరాళే ఆఫీసుకు వెళ్ళిపోయారమ్మా, రేపు రామ్మా."

పాలవ్వ రుసరుసలాడుకుంటూ వెళ్ళిపోయింది. ఐనప్పటికీ రోజూ పాలుపోసే ఈ పాలవ్వ రెండు నెలల డబ్బులివ్వని ఎన్జీవోనిసైతం తనకంటే అదృష్టవంతు డనుకొంటుంది. కాని ఏడు గంటలదాకా ఆఫీసులో దించిన తల ఎత్తకుండా యంత్రంలా పనిచేసి బైటపడి, ఇల్లాలిని ఒక్కసారి తలచుకొని, (అక్కడ ఇల్లాలు గుమ్మంలో పసిపాపని ఒళ్ళో పెట్టుకొని 'దేహీ' అంటూ అరుస్తోన్న పచ్చి బాలింతని 'వేళాపాళా లేకుండా ఒకటే జోరీగ రోద" అని విసుక్కుంటోంది) డొక్క జానెడు పీక్కుపోగా కాళ్ళీడ్చుకుంటూ, రంగురంగు దీపాల వెలుగులో అంతంత ఎత్తుమేడల క్రిందుగా సరసనే హోటల్లోని గ్లాసుసామాను చప్పుళ్ళూ తదితర రొద వింటూ, చూస్తూ, తూలుతూన్నట్లు నడిచి వచ్చే ఎన్జీవో బాధ, పాలవ్వ ఏమాత్రం అర్థం చేసు

కొని అలా అనుకోండి-తనకంటే అదృష్టవంతుడని? రేపు ప్రొద్దున్న పాలివ్వకపోతే ఏం సమాధానం చెప్పాలో అని పీచుపీచు మంటోన్న ఈ ఎన్జీవో "పాలవ్వే నయం, నాకంటే" అనుకొంటున్నాడు. ఇంకా అపర సంధ్యదాకా, ఆ చాకిరేవులో బండ చాకిరి చేసి—ఒకరోజుతో తీరిపోయేది కానేకాదు—గృహోన్ముఖియైన చాకలవ్వకంటే ఈ ఎన్జీవో మెరుగేగామరి! ఎన్జీవో తెల్లవారి "టీ"కి పంచదార లేదని ఆవేదనపడ్తున్నాడు. చాకలమ్మ మాత్రం గంజిలోకి ఉప్పులేదే అని వ్యథపడ్తొంది.

• • •

జనసంకులమైన వీధిలో పేవ్‌మెంట్ మీద నడుస్తూన్నాడు ఓ వీధిమానిసి. పక్కనుండి తళతళమెరిసే కార్లు సిమెంట్ రోడ్డుమీద జారిపోతున్నాయి—కడుపులోని కాఫీ కదలకుండా. అంతైతే రోడ్డుమీది ధూళి కాస్తా వీధిమానిసి కళ్ళల్లోకి విసిరికొట్టి "అదృష్టవంతులు!" అనుకున్నాడు వీధిమానిసి. అంతేకాదు, బాధపడ్తున్నాడు. తన దురదృష్టానికి ఇంకా అందులో—ఆ కారులో-తళతళుక్కుమనే "మెఱుపుతీగెలు" ప్రయాణిస్తే మరీ బాధ! మరి, ఆరోడ్డుమీదే "బాబా! ఏక్ పైసా" అనే ముష్టివాడు వీధి మానిసినిచూసి ఏమనుకుంటాడు?—ఆకార్లో వెళ్ళినవారికీ ఈ వీధి మానిసి-ముష్టివానికీ కోరికలు లేకపోలేదు. కాని, ఎంతేని తేడాతో అందరూ తలపోసేది ఒక్కటే!

అలాగే, చీదరించుకొంటున్న ఎన్జీవో శ్రీమతిని చూసి ఆ బాలింత ఏమనుకొంటుంది? ఆమెది నీడలేని బ్రతుకు! ఊరి పొలిమేరలో ఓ చెట్టుక్రింద ఆమె ఆశ్రయం. ప్రసవించేది ఆ చెట్టుక్రిందే. ఘరానా వాళ్ళింటికివచ్చే స్పెషలిస్టులూ సర్జన్లూ ఎవరూ రానవసరంలేదు. ఇవాళ ఇక్కడ, రేపు ఎక్కడో! చెట్టునీడ ఎటుతిరిగితే అటు తిరిగి నీడ సంపాదించుకుంటుంది. ఆమె 'వంట' గాలి నాలుగువేపులా స్వారిచేసే చోటు వరుణదేవుడు కటాక్షిస్తే చెట్టు మ్రానుకు అంటుకుపోతుంది. అంతైతే తడుస్తుంది. అప్పుడే ఆమె అభ్యంగన స్నానం చేసేది—నిలవ నీడలేని ఈ బాలింత ఆ ఎన్జీవో శ్రీమతినిచూసి మరొకటేమనుకొంటుంది?

కొందరు ఏడుస్తూంటారు. మరి కొందరు నవ్వుతూ ఉంటారు. ఇంకా కొందరు ఏడ్వలేకా నవ్వలేకా బాధపడ్తూంటారు. మరొకప్పుడుఏడ్చిన వారు నవ్వుతూ ఉంటారు; నవ్వినవారు ఏడుస్తూ ఉంటారు. అందరూ ఏడవలేరు-అందరూనవ్వలేరు. ఏడ్చేవారిని చూస్తే నవ్వేవారికిఆనందం, సంతృప్తి.

పైవారినిచూసి కించపడతాం. నిస్పృహతో కన్నీళ్ళు కారుస్తాం. ఇలా అట్టడుక్కు జారిపోయేకంటె, తన క్రిందివారిని చూసి సంతృప్తి పొందాలి. (అయితే దీన్ని అభివృద్ధి కెగ్రబాకేప్పుడు మాత్రం మినహాయించుకోవాలి) అప్పుడే మనలో మన స్తాపం ఉండదు. సవ్యంగా బ్రతకడానికి అవకాశం. ఇంకా ఉన్నత భావానికివెళ్ళి క్రిందివారంటే జాలి చూపాలి. అంతేకాదు అవసరమైతే ఆపత్సమయాలలో ఆదుకోవడానికి శాయశక్తులా సాయపడాలి. ఆ కార్లోవెళ్ళేవాళ్ళు వేయి వ్యాపకాలని వెలగబెట్టడానికి వెళ్తున్నారనుకోవద్దు. వాళ్ళెంత హడావుడిగా పరువెత్తి పోతున్నా ముళ్ళులేని గడియారమే వాళ్ళజీవితం అనే తూష్ణీంభావం అలవరచుకోవాలి. వాళ్ళ చరిత్ర తప్పుల తడక అనుకోవాలి. వాళ్ళ "రాత్రించరులు" అనుకోవాలి (చీకట్లో ఎన్నో అకృత్యాలు జరుగుతాయి. దుష్టశక్తులు నర్తిస్తాయి. అవి ఎవ్వరికీ కన్పించవు. పైకి పొక్కవు. ఈ చీకటే ఆ వెళ్ళేవారి హోదా కరపతినిబట్టి మరింత గాఢం అవుతుంది) బ్రతకడానికి ఆశ కల్పించుకొని ప్రతిక్షణమూ వెన్నంటే కష్టాల్ని 'జితోస్మి' అనిపించాలి. లోకంలో ఇలా మెట్లుమెట్లుగా అంతస్తులుండాలి. ఉంటేనే కష్టసుఖాలకీ అనుభూతి ఆంతర్యాలకీ తావుంటుంది. ఆర్థికస్తోమత ఉన్నంతసేపు బ్రతుకని, ఆ స్తోమతు పోగానే నైరాశ్యానికి జారిపోయి 'నా బ్రతుకేం బ్రతుకు' అనేవారి బ్రతుకు ఆర్థికస్తోమత మళ్ళీ సమకూరినా సరియైన బ్రతుకుకాదు.

పై మాటలు ఎన్జీవోకి, వీధి మానిసికీ పాలమ్మ చాకలమ్మలకీ నాకూ సమాధానం చెప్పగలవ్. బ్రతుకంటే ఆశాభావం రేకెత్తించనూవచ్చు. కాని బాలింతనీ, పేవ్‌మెంట్ ముష్టివాణ్ణీ ఏం సమాధానంచెప్పి సంతృప్తిపరచగలవ్? తమకంటే క్రింది వారి నెవరినిచూసి వీళ్ళు సమాధానపడాలి? తమ పైవాళ్ళని అదోవిధంగా చిత్రించుకొని ఉపశమనం పొందగలరా? ఆవిధంగా చిత్రించుకుంటారా? వీళ్ళ నేశక్తి బ్రతుకును ఆశావహంగా నడిపిస్తోంది? ★